సాక్షి
నల్లగొండ

బుధవారం, 20, ఆగస్టు, 2025



సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రపుల్ రాంరెడ్డి అన్నారు. - 8లో



బుద్ధవనంలో ప్రతినిధులు

సాగర్‌లోని బుద్ధవనాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	584.60 అడుగులు
ఇన్‌ఫ్లో	:	4,10,186 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	4,09,506 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	23,007 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	7,528 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,949 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేను ఎవరినీ కించపరచలేదు : కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణి సందర్భంగా తాను ఎవరినీ కులం, మతం పేరుతో కించపరచలేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్ యుద్ధ సంఘటనకు సంబంధించి జిల్లాలోని కొంతమంది ఉలేమాలు తనకు దరఖాస్తును ఇచ్చారని, ఆ సందర్భంలో వారికి సంబంధం లేని హైదరాబాద్‌కు చెందిన దేవి అనే మహిళ కలెక్టర్‌ను 'నువ్వు.. నువ్వు' అని సంబోధించిందని.. జిల్లా అధికారులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేసిందని తెలిపారు. అయినప్పటికీ తాను ఆమెకు సముచితంగా సమాధానం చెప్పి పంపామని తెలిపారు. 18వ తేదీన ప్రజావాణిలో ఉలేమాలను తాను కించపరిచాననడం నిజం కాదని కలెక్టర్ పేర్కొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో విఫలం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

తిప్పర్తి : మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం తిప్పర్తి సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఐద్వా జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మహిళలను వంటింటికి పరిమితం చేస్తూ.. అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం లేదన్నారు. మహిళలను చైతన్యం చేసేందుకు ఐద్వా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడగు ప్రభావతి, అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, అనురాధ, పద్మ, నాగమణి, గోవర్ధన, సుల్తానా, ధనలక్ష్మి, జంజరాల ఉమ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు విరివిగా పెంచాలి



మొక్క నాటుతున్న అటవీ అధికారి రాజశేఖర్

నల్లగొండ : మొక్కలను విరివిగా పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం ఆయన నల్లగొండలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక కార్యకర్త సురేష్ గుప్తాతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుళ్లకు కరాటే శిక్షణ




మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలోని 14 పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా విధుల్లో చేరిన మహిళా కానిస్టేబుళ్లకు సెల్ఫ్ డిఫెన్స్‌లో భాగంగా మంగళవారం కరాటే శిక్షణ ఇచ్చారు. మిర్యాగులగూలోని ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్‌లో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని డీఎస్పీ కె.రాజశేఖరరాజు ప్రారంభించి మాట్లాడారు. మహిళా కానిస్టేబుళ్లకు ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా కరాటే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు మోతీరామ్, సోమనర్సయ్య, పీఎస్‌డీ ప్రసాద్, కరాటే కోచ్ శ్రీధర్, ఎస్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో తనిఖీలు

చిట్యాల : వ్యవసాయానికి ఉపయోగించే యూరియా, ఎరువులు పక్కదారి పడుతున్న నేపథ్యంలో చిట్యాల మున్సిపాలిటీలో, నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లిలోని ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలను మంగళవారం జిల్లా పరిశ్రమలశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఆ పరిశ్రమలో వాడుతున్న రసాయన పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సతీష్, నకిరేకల్ ఏడీఏ జానీమియా మాట్లాడుతూ యూరియాను, ఎరువులను పరిశ్రమల్లో వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ గిరిబాబు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



బిరబిరా కృష్ణమ్మ

విద్యుద్దీపాల వెలుగులో 26 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

యూరియా ఏదయా!

- సహకార సంఘాల్లో వెంటనే ఖాళీ అవుతున్న నిల్వలు
- ఫర్టిలైజర్ షాపుల బాట పట్టిన రైతులు
- బస్తాకు రూ.50 అదనం.. పురుగు మందులూ కొనాలని షరతు
- మళ్లీ దొరకదేమోనని అవసరానికి మించి యూరియా కొనుగోలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రాథమిక సహకార సంఘాలకు కేటాయించిన యూరియా నిల్వలు వెంటనే ఖాళీ అవుతున్నాయి. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇచ్చినా.. అందరికీ అందడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రైవేట్ డీలర్లు ఇదే అదనుగా భావించి ఒక్కో బస్తాపై రూ.50కి పైగా అదనంగా వసూలు చేయడమే కాకుండా ఇతర పురుగు మందులను అంటగడుతున్నారు. మరోవైపు యూరియా కొరత కారణంగా మళ్లీ దొరకదేమో అనే ఆందోళనతో రైతులు ఎక్కువ రేటు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

కేటాయింపు ఎక్కువ.. సరఫరా తక్కువ

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 10,60,650 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. అందులో వరి 4,07,350 ఎకరాల్లో, పత్తి 5,59,640 ఎకరాల్లో, మిగతా కంది, పెసర, ఇతర మెట్ట పంటలను సాగు చేశారు. సీజన్‌లో పత్తి, వరి పంటకు రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. జిల్లాకు ఈ సీజన్‌లో ఇప్పటివరకు 70 వేల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం అలాట్ చేసింది. కానీ, అందులో 44,500 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే జిల్లాకు సరఫరా అయింది. దీనిలో వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలకు 24 వేల మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 20,500 మెట్రిక్ టన్నుల కేటాయించారు. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు యూరియాను రైతులు వెంటవెంటనే కొనుగోలు చేస్తుండడంతో అక్కడ నాలుగైదు రోజుల్లోనే యూరియా ఖాళీ అయ్యింది.



తిప్పర్తి పీఏసీఎస్ వద్ద పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టిన రైతులు

వర్షాలు పడుతుండటంతో పెరిగిన డిమాండ్

జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటం, వరి నాట్లు ఊపందుకోవడంతో పత్తి, వరి చేలకు యూరియా వినియోగం ఒక్కసారిగా పెరిగింది. రైతులు సీజన్ ఆరంభానికి ముందే యూరియాను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవడంతో పాటు యూరియా వాడకం మోతాదును పెంచుతున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కేటాయింపులో కోత విధిస్తోంది. ఈ కారణంగా జిల్లాలో యూరియా కొరత తీవ్ర అవుతోంది.

మెజారిటీ పీఏసీఎస్‌లలో కొరతే

- చిట్యాల పీఏసీఎస్‌లో ప్రస్తుతం యూరియా అందుబాటులో లేదు. ఇప్పటివరకు రైతులకు ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియాను మాత్రమే ఇచ్చారు. మండలంలో 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 2500 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది.
- నాంపల్లి మండలంలో పీఏసీఎస్‌ల్లో యూరియా లేకపోవడంతో ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో బస్తాకు రూ.360 నుంచి రూ.400 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.
- గట్టుపల్ మండలానికి 180 టన్నులు రాగా, ఇంకా అవసరముందని పది రోజుల కిందట ఇండెంట్ పెట్టి నగదు చెల్లించినా ఇంతవరకు అందలేదు.
- తిప్పర్తి, వేములపల్లి, పెద్దవూర మండలాల్లోనూ అధిక కొరత ఉంది.
- అనుముల మండలానికి 4 వేల మెట్రిక్ టన్నులు అవసరమైతే 1200 మెట్రిక్ టన్నులే వచ్చింది. ఒక్క కొత్తపల్లి పీఏసీఎస్‌కు వచ్చిన యూరియా వెంటనే అయిపోయింది. ఇక్కడ ఎకరానికి ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. 120 మెట్రిక్ టన్నుల యూరియా కోసం డీడీ చెల్లించినా ఇంతవరకు రాలేదు.
- మునుగోడుకు వారం కిందట వచ్చిన యూరియా వెంటనే అయిపోయింది. మళ్లీ ఇప్పటివరకు రాలేదు.
- కనగల్, నిడమనూరు మండలాల్లోని పీఏసీఎస్‌లలో వారం రోజులుగా, మాడులపల్లి సొసైటీల్లో నాలుగు రోజులుగా యూరియా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యవసాయేతర అవసరాలకు యూరియా వాడొద్దు

నల్లగొండ : వ్యవసాయేతర అవసరాలకు యూరియా వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం ఆమె నల్లగొండలోని ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని, గోదాములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరం లేనిచోట యూరియా డంప్ చేయవద్దని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియా అమ్మాలన్నారు. యూరియా, ఎరువుల సక్రమ సరఫరా కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆమె వెంట నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.



యూరియా గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

యూరియా దొరకట్లేదు



నాకు 10 ఎకరాల భూమి ఉంది. 20 రోజుల కిందట నాటు వేశాను. నాటేసిన 15 రోజుల్లోపే పొలానికి యూరియా వేస్తేనే పంట దిగుబడి వస్తుంది. యూరియా కోసం నేను 12 రోజులుగా తిరుగుతున్నా. నిడమనూరు సొసైటీ వద్దకు వెళ్తే.. మీ దగ్గరే తీసుకోవాలని అంటున్నారు. యూరియాను సకాలం అందించి ఆదుకోవాలి.

– రావుల రామసైదులు, రైతు, చల్మారెడ్డిగూడెం, హాలియా మండలం

యూరియా కొరత లేకుండా చూడాలి



మాడ్గులపల్లి, వేములపల్లి సొసైటీల్లో యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నాం. యూరియా ఎమ్మార్పీ రూ.266 ఉండగా.. ప్రైవేట్ ఎరువుల షాపుల్లో రూ.300 పెట్టి కొనాల్సి వస్తోంది. అక్కడ కూడా ఆధార్‌కార్డుకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో పంటకు సకాలంలో యూరియా అందించకపోవడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించాలి.

– పందుగ నాగయ్య, రైతు, కుక్కదం, మాడుగులపల్లి మండలం

నెలాఖరులో 4 వేల మెట్రిక్ టన్నులు వస్తుంది



జిల్లాలో ప్రస్తుతం 2500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఈ నెలాఖరుకు మరో 4 వేల మెట్రిక్ టన్నులు వస్తుంది. నానో యూరియా 40 వేల లీటర్ల మార్కెట్‌లో అందుబాటులో ఉంది. నానో యూరియా ధర కూడా తక్కువగా ఉన్నందున రైతులు వినియోగించుకోవచ్చు. ఎక్కువ ధరకు యూరియాను విక్రయించకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ఎవరైనా అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు వరద రాక కొనసాగుతోంది. దీంతో మంగళవారం అధికారులు ప్రాజెక్టు ఎనిమిది క్రస్ట్‌గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం వరకు ఎగువ ప్రాంతాల నుండి మూసీకి 13,294 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 645 అడుగుల (4.46 టీఎంసీలు) గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 643 అడుగుల (3.94 టీఎంసీలు) వద్ద ఉంది. ప్రాజెక్టులో నాలుగు క్రస్ట్‌గేట్లను మూడు అడుగులు, మరో నాలుగు క్రస్ట్‌గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 12,270 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాల్వలకు 94 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

45 శాతం అధిక వర్షం

- జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు
- ఇప్పటి వరకు కురవాల్సింది 276 మి.మీ, కురిసింది 399 మి.మీ



నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో సాధారణం కంటే 45 శాతం అధిక వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల కారణంగా 20 రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జూలై చివరి వరకు జిల్లాలో లోటు వర్షపాతం నమోదవగా.. ఆగస్టు తొలి వారం నుంచి జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిసి అధిక వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు 276 మిల్లీమీటర్ల సాధారణ వర్షం కురవాల్సి ఉండగా.. 399 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

12 మండలాల్లో అత్యధికం

జిల్లాలోని 12 మండలాల్లో అత్యధికంగా, 10 మండలాల్లో అధికంగా, 11 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. శాలిగౌరారం, మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, అడవిదేవులపల్లి, పెద్దవూర, పీఏపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ, గుడిపల్లి, చందంపేట, మండలాల్లో అత్యధిక వర్షం కురిసింది. చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, కనగల్, అనుముల, హాలియా, మాడ్గులపల్లి, దామరచర్ల, తిరుమలగిరి సాగర్, నేరడుగొమ్ము మండలాల్లో అధిక వర్షం కురిసింది. కేతేపల్లి, తిప్పర్తి, నల్లగొండ, మునుగోడు, చండూరు, నాంపల్లి, నిడమనూరు, త్రిపురారం, వేములపల్లి, మిర్యాలగూడ, గట్టుప్పల్ మండలాల్లో సాధారణ వర్షం కురిసింది.

ఊపందుకున్న వరి నాట్లు..

అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. వారం క్రితం వరకు 2.50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ప్రస్తుతం వర్షాలకు తోడు నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ, మూసీ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు రావడంతో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 4,07,465 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు మరో లక్ష ఎకరాల్లో రైతులు నాట్లు వేసుకునే అవకాశం ఉంది.

సంపదను దోచుకుంటున్న పాలకులు



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ : దేశంలో ఉన్న సంపదను కొల్లగొట్టేందుకు కార్పొరేట్లు, ఓట్లను పాలకులు దోచుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సంపద కొంతమంది చేతుల్లోకి వెళ్తుందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లో అధికారం కోసం తప్పుడు మార్గాలు అనుసరిస్తోందని విమర్శించారు. బిహార్‌లో బీజేపీకి ఓటు వేయని 65 లక్షల ఓట్లను తొలగించారని ధ్వజమెత్తారు. స్వతంత్ర్యంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కీలుబొమ్మగా మారిపోయిందన్నారు. కేంద్ర,. రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. తెలంగాణలో యూరియా కొరత తీవ్రంగా ఉందని రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్షతను చూపుతోందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, శశిధర్ రెడ్డి, రెమడాల పరుశురాములు, తిరుపతి రామ్మూర్తి, కరీం, నాగేశ్వర్‌రావునాయక్, రామారావు, ఉన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు క్లియర్ చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు తెలుసుకుని.. కేసుల ఇన్వెస్టిగేషన్ పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఇన్వెస్టిగేషన్ త్వరగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలన్నారు. గ్రామ పోలీసు అధికారులు రోజూ గ్రామానికి వెళ్లి ప్రజలతో మమేకం అవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు, ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకొని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, రవికుమార్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



స్వర్ణగిరి క్షేత్రంలో సహస్ర కుంకుమార్చన

భువనగిరి: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన సేవ, నిత్య కల్యాణ మహోత్సవం జరిపించారు. సాయంత్రం వేళ తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండలోని ఏఆర్‌నగర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె నల్లగొండ పట్టణంలో గతేడాది ఏఆర్‌నగర్‌లో ఎక్కువ డెంగీ కేసులు నమోదైన ఏఆర్‌నగర్‌లో పర్యటించారు. వార్డు పరిసరాలు, డ్రెయినేజీలు, ఇళ్లను పరిశీలించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను గమనించారు. వార్డుల్లో ఓపెన్ డ్రెయినేజీలను మూసి వేయాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌ను ఆదేశించారు. వార్డులో నిర్వహిస్తున్న జ్వర సర్వే వివరాలను మలేరియా సిబ్బంది మాట్లాడి తెలుసుకున్నారు. డాక్టర్లు వచ్చారా? రక్తం నమూనాలు తీసుకున్నారా? అని ఇళ్ల యజమానులను అడిగారు.

లైన్‌వాడ ఆస్పత్రి తనిఖీ

నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ అందుబాటులో ఉన్న మందులు, నమోదైన హైరిస్క్ కేసులు, ప్రసవాల నమోదు, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణుల ఈడీడీ కేసులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లైన్‌వాడ వార్డులో జనాభా ఎక్కువగా ఉన్నందున ఇక్కడ మరో పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్, డాక్టర్ ఇంతియాజ్, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

జిల్లాలో మాదక ద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో మత్తు మందుల నివారణ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ యువత మత్తు మందులకు బానిస కాకుండా అన్ని స్థాయిలలో అవగాహన కల్పించాలన్నారు. నల్లగొండను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకల మాదకద్రవ్య నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ అతివేగం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అన్ని కార్యాలయాల్లో ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ను కోరారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏఎస్పీ మౌనిక, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్, ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో మూడో స్థానం


కీర్తనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నల్లగొండ: నల్లగొండలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి .కీర్తన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో సత్తాచాటింది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 3వ స్థానం సాధించింది. కీర్తనను మంగళవారం ప్రిన్సిపాల్ కుతేజుల్ కుబ్రా, అధ్యాపకులు అభినందించారు.

శ్వాస మీద ధ్యాసతోనే సంపూర్ణ ఆరోగ్యం


ధ్యాన మందిరంలో మాట్లాడుతున్న సంత్‌సదానంద గిరి మహారాజ్ స్వామీజీ

సూర్యాపేట: శ్వాస మీద ధ్యాసతోనే ఆరోగ్యంగా ఉంటామని సంత్‌సదానంద గిరి మహారాజ్ స్వామీజీ అన్నారు. మంగళవారం గుంటూరు నుంచి వరంగల్ వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల పిరమిడ్ ట్రస్ట్ ధ్యాన మందిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి ధ్యానం చేస్తూ ఆరోగ్యముక్తిని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షురాలు తోట నాగమణి, ప్రధాన కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు, కోశాధికారి చందా విశ్వనాథం, ఉపాధ్యక్షులు కోటగిరి రాధాకృష్ణ, కక్కిరేణి రవిచంద్ర, హరిప్రసాద్, దయాసాగర్, శ్రీనివాస్, విజయ్, సువర్ణ, కేదారేశ్వరి, సంధ్య, మహేందర్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

భువనగిరి: అప్పుల బాధతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లేపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి మాధవి(35), నర్సింహ భార్యాభర్తలు. అప్పులు ఎక్కువ కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం అప్పుల విషయమై ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన మాధవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సమయం తర్వాత ఇంట్లోకి వచ్చిన వారి కుమారుడు గమనించి స్థానికులకు సమాచారం అందించాడు. స్థానికులు వచ్చి చూడగా.. అప్పటికే మాధవి మృతిచెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మృతిరాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది.

వాహనం ఢీకొని రెండు ఆవులు మృతి

త్రిపురారం: వాహనం ఢీకొని రెండు ఆవులు మృతిచెందాయి. ఈ ఘటన త్రిపురారం మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని రాజమండ్రి నుంచి కొబ్బరికాయల లోడుతో జడ్చర్లకు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం త్రిపురారం మండల కేంద్రంలో రెండు ఆవులకు ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని బాధిత రైతు వలసాని సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

● భూమికి పచ్చాని రంగేసినట్టు..


యాదగిరిగుట్ట: గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు యాదగిరిగుట్ట పట్టణమంతా ఎక్కడ చూసినా ఆకుపచ్చని అందాలతో కనువిందు చేస్తోంది. యాదగిరి కొండపై నుంచి ఎటుచూసినా కనుచూపు మేర పచ్చని పాలాలు, చెట్ల మధ్యన ఇళ్లతో ఆకట్టుకుంటోంది.

కేబుల్ వైర్లు కట్ చేయాల్సిందే

- విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తొలగించాలని ప్రభుత్వం ఆదేశం
- క్రమపద్ధతిలో అమర్చుకోవడంలో ఆపరేటర్లు విఫలం


కోదాడలోని నయానగర్‌లో విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లు

కోదాడ: విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లతో నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాలకు క్రమపద్ధతిలో అమర్చుకోవాలని విద్యుత్ శాఖ చెబుతున్నా ఇప్పటివరకు పెడచెవిన పెట్టిన కేబుల్ ఆపరేటర్లకు ఆ శాఖ షాక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో రెండు రోజుల క్రితం కేబుల్ వైర్ల వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి ఐదుగురు చనిపోవడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లో స్తంభాలకు వేలాడదీసిన కేబుల్ వైర్లను ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో స్థానిక సిబ్బంది రెండు మూడు రోజుల్లో కత్తిరించి వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

అవగాహన లోపంతోనే తిప్పలు

మున్సిపాలిటీల్లో కేబుల్ కనెక్షన్లతో పాటు ఇంటర్నెట్ కేబుల్స్‌ను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తుంటారు. పదుల సంఖ్యలో ఉన్న ఆపరేటర్లు ఇష్టారీతిన వీటిని స్తంభాలకు వేలాడదీస్తుండడంతో సమస్య వచ్చినపుడు స్తంభం ఎక్కడానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని విద్యుత్ సిబ్బంది చెబుతున్నా ఆపరేటర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీనికి తోడు తక్కువ ఎత్తులో తీగలను వేలాడదీస్తుండడంతో భారీ వాహనాలకు తగిలి తరచూ ఇవి తెగిపడడం, కిందకు జారడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కట్టలుగా కేబుల్ వైర్లను స్తంభాలకు కడుతుండడంతో షార్ట్ సర్క్యూట్స్ సర్వసాధారణంగా మారాయి.

కట్ చేస్తే ఇబ్బందే..

విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కేబుల్ వైర్లను కట్ చేస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు అంటున్నారు. సాధారణ టీవీ కేబుల్స్‌తో పాటు ఇంటర్‌నెట్ కేబుల్స్ కూడా విద్యుత్ స్తంభాలకు ఉన్నాయి. వీటిని కట్ చేస్తే పలువురికి ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా పోతుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేసే ఐటీ ఉద్యోగులతో పాటు విద్యార్థులు కూడా ఇబ్బంది పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తుగా ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డి


అభివాదం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రహ్మండ్లపల్లి కల్యాణ మండపంలో మంగళవారం టీయూ జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కోడి సైదులుయాదవ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసులకు, పోలీసు తూటాలకు భయపడకుండా పాల్గొన్నామని గుర్తు చేశారు. ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం, నాలుగు గదుల ఇళ్ల నిర్మాణం, రూ.30వేల పెన్షన్ సౌకర్యం కల్పించి, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యమకారులకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్య, వైద్యం, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చూడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రన్న ప్రసాద్, క్రిస్టోఫర్, బి. లావణ్య, వైస్ ప్రెసిడెంట్‌లు అంజలికుమారి, హరిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ తుల్జారెడ్డి, సలహాదారులు శంకర్‌రావు, తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లారా, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూసుఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కపాక కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జటంగి సోనయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడబోయిన గంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిగుజ్జు రామచంద్రయ్య, టీయూ జేఏసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గోనే విజయ, కమ్మంపాటి లక్ష్మమ్మ, తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక జిల్లా అధ్యక్షురాలు తండు దేవిక, జిల్లా ప్రధాన కార్యదర్శి నోముల ఉమా, పట్టణ అధ్యక్షురాలు బంటు ఎల్లమ్మ, ప్రధాన కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

మూత్రవిసర్జనకు వెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్: ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మూత్రవిసర్జన చేసేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురైన మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాలబావి సెంటర్‌లో నివాసముంటున్న దంతాల చక్రధర్‌రావు(56) గతంలో ప్రైవేట్ లెక్చరర్‌గా పనిచేసేవాడు. గత రెండేళ్లుగా ఖాళీగానే ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వాణిజ్య భవన్ సెంటర్ వైపు వెళ్లి పాత మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్రవిసర్జన చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రోహిణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో పోలీసులు, విద్యుత్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాకే అది విద్యుదాఘాతమా లేదా ఇంకేమైనా కారణం ఉందొచ్చా అనేది చెబుతామని పట్టణ సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొండమల్లేపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొర్రతండాలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రతండాకు చెందిన కొర్ర పట్టి గ్రామంలో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టింది. ఆమె భర్త ధన్య గతంలోనే మృతిచెందాడు. కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పక్కనే జహిందర్ ఇంట్లో పట్టి అద్దెకు ఉంటోంది. సోమవారం రాత్రి ఆమె అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లోకి వెళ్లి నిద్రించింది. మంగళవారం ఉదయం అద్దె ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని కేజీ వెండి, రూ.1.50లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.2.35కోట్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, కానుకలను మంగళవారం కొండకు దిగువన ఉన్న శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ వెంకట్రావ్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. మొత్తం రూ.2,35, 32,627 నగదు వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. మిశ్రమ బంగారం 76 గ్రాములు, మిశ్రమ వెండి 9కిలోల 475గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు వివిధ దేశాల కరెన్సీలు సైతం హుండీల్లో వచ్చాయని ఈఓ తెలిపారు. హుండీ ఆదాయం 27 రోజులదని వెల్లడించారు.


హుండీల్లో వచ్చిన నగదు, కానుకలను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- మిడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీ పనుల విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో తమ అభిప్రాయాలను తెలుపుతున్న స్థానికులు

కోదాడరూరల్: కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామ శివారులో గల మిడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీ కంపెనీ చేపట్టనున్న 9.87 హెక్టార్ల పనుల విస్తరణపై అదనపు కలెక్టర్ రాంబాబు సమక్షంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్వారీ సమీపంలోని నల్లబండగూడెం, మంగళితండా, చిమిర్యాల గ్రామాల ప్రజలు, నాయకులు మాట్లాడుతూ.. క్వారీ విస్తరించుకుంటే తమకు అభ్యంతరం లేదని.. కానీ స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా క్వారీ నుంచి నల్లబండగూడెం వెళ్తున్న రోడ్డు ధ్వంసమైందని.. ఈ మార్గంలో వాగుపై ఉన్న బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలన్నారు. మూడు గ్రామాలల్లో నెలకోసారి హెల్త్ క్యాంపులు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులున్న ప్రజలకు మందులు అందజేయాలని కోరారు. అదేవిధంగా పాఠశాలల అభివృద్ధికి, చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయాలన్నారు. పలు ఎన్‌జీఓలు, పర్యావరణ, సామాజిక ఉద్యమకారులు మాట్లాడుతూ.. క్వారీ నుంచి దుమ్ముధూళి రాకుండా చూడాలని సూచించారు. క్వారీ చుట్టూ ఉన్న రైతుల పొలాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం కాలుష్యం జరగకుండా పరిసర ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలన్నారు. కంపెనీ సీఓఓ మల్లికార్జున రావు మాట్లాడుతూ.. క్వారీలో 80శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పిస్తున్నామని, విద్యార్హతను బట్టి టెక్నీషియన్స్, ఎలక్ట్రానిక్స్, ఆపరేటర్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు ఇస్తామన్నారు. ఇప్పటికే క్వారీ చుట్టూ ఉన్న మూడు గ్రామాల కోసం ఓ అంబులెన్స్ ఏర్పాటును చేశామని, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలలో మందులు ఇస్తున్నామని, పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు కూడా నాటుతామని సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురి వద్ద నుంచి లిఖితపూర్వకంగా, 40మంది నుంచి తీసుకున్న అభిప్రాయాలను రాష్ట్ర పర్యావరణ ఉన్నతాధికారులకు పంపిస్తామని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ వెంకన్న, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజిద్అలీ, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలి


ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో కల్నల్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం

రామన్నపేట: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశభక్తితో పాటు సత్ప్రవర్తన, సేవాభావం పెంపొందించుకోవాలని 31(టీ) బెటాలియన్ కల్నల్ టి. లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశం కొరకు దేహదారుఢ్య, రాత పరీక్ష నిర్వహించారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉన్నత చదువులు, ఆర్మీ, పోలీసు ఉద్యోగాలు పొందడానికి మెరుగైన అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రాచమల్ల శ్రీను, బెటాలియన్ సుబేదార్ మేజర్ మాధవరావు, సుబేదార్ కొమ్ము మల్లయ్య, హవల్దార్లు సురేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శించిన ఉత్తరప్రదేశ్ ప్రతినిధులు


బుద్ధుడి పాదుకలకు పూజలు చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కౌశాంబి జిల్లాలో 10 ఎకరాల్లో బుద్ధవనం తరహాలో థీమ్ పార్కు నిర్మించనున్న నేపథ్యంలో ఆ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలేంద్రసింగ్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం బుద్ధవనం సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర స్వాగతం పలికారు. యమునా నది తీరంలో ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి ప్రాంతంలో జ్ఞానసిద్ధికై సిద్ధార్థుడు మూడేళ్ల పాటు తపస్సు చేశాడని.. అంతటి ప్రసిద్ధమైన ప్రదేశంలో రూ.80కోట్ల వ్యయంతో బుద్ధిష్ట థీమ్ పార్కు నిర్మించనున్నట్లు శైలేంద్రసింగ్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు దీనిని పూర్తిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వెంట ఆర్కిటెక్ట్ రాహుల్, ఇంజనీర్ కళ్యాణ్‌చంద్ర, స్థపతి గిరీష్‌తివారి ఉన్నారు. వీరికి గైడ్ సత్యనారాయణ బుద్ధవనం గురించి వివరించారు.

సాగర్‌కు పోటెత్తిన వరద.. ఆగిన లాంచీలు


సాగర్ జలాశయ తీరంలో నిలిచిన లాంచీలు

నాగార్జునసాగర్: ఎగువన గల శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే వరద భారీస్థాయిలో పెరగడంతో పాటు గాలి వీస్తుండటంతో మంగళవారం నాగార్జునకొండకు లాంచీలు నిలిచిపోయాయి. శ్రీశైలం జలాశయం నుంచి 10గేట్లు ద్వారా 3,44,750 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో మరో 65436 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీనికి తోడు గాలి వీస్తోంది. దీంతో సాగర్ జలాశయంలో అలజడి మొదలై అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆంధ్రా పరిధిలోని రైట్‌బ్యాంక్ నుంచి నాగార్జునకొండ మ్యూజియంలో పనిచేసే ఉద్యోగులను నిత్యం లాంచీలలో తీసుకొస్తుంటారు. అయితే గాలి వీస్తుందని అక్కడి లాంచీలు సరైన ఫిట్‌నెస్ లేకపోవడంతో నడపలేదు. మ్యూజియం తెరవకపోవడంతో తెలంగాణ నుంచి కూడా లాంచీలను నాగార్జునకొండకు నడపలేదని సిబ్బంది తెలిపారు. జాలీ ట్రిప్పులు వేసేందుకు కొంతమేరకు అవకాశమున్నప్పటికీ పర్యాటకులు లేకపోవడంతో లాంచీలను నడపలేదని సమాచారం.

14 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల


పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు మంగళవారం రాత్రి వరకు 3,97,807 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 14 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 4,13,395 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటితో నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టెయిల్‌పాండ్ నుంచి 16 గేట్ల ద్వారా దిగువకు..


టెయిల్‌పాండ్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి సమీపంలో కృష్ణానదిపై గల టెయిల్‌పాండ్ నుంచి వరద నీటిని 16 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం నాగార్జునసాగర్ జలాశయం నుంచి 3,94,329 క్యూసెక్కుల నీరు టెయిల్‌పాండ్‌కు వచ్చి చేరుతుండగా.. దిగువకు 4,03,241 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో ఉపాధి

- ఆదర్శంగా నిలుస్తున్న చీదెళ్ల గ్రామ యువకులు


నారాయణపురంలో డ్రమ్‌సీడర్‌లు లాగుతున్న చీదెళ్ల యువకులు

నడిగూడెం: వ్యవసాయంలో కూలీలు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పెట్టుబడులు కూడా బాగా పెరిగాయి. పంటల సాగులో కొత్త పద్ధతులు వస్తుండడంతో రైతులకు ఉపయోగకరంగా మారాయి. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఒక బృందంగా ఏర్పడి జిల్లాలోని పలు గ్రామాల్లో తిరుగుతూ డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరి సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

రోజుకు 7 నుంచి 8 ఎకరాల్లో..

చీదెళ్ల గ్రామానికి చెందిన తండు ప్రవీణ్, వేర్పుల వీరబాబు, వేల్పుల మధు, వరికల్లు శ్రీను ఒక బృందంగా ఏర్పడి స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో నాలుగు డ్రమ్ సీడర్‌లు కొనుగోలు చేశారు. వీరు గత ఐదేళ్ల నుంచి సూర్యాపేటతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోని నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లో డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా రైతుల భూముల్లో నేరుగా వరి విత్తనాలు విత్తుతున్నారు. దీనికి గాను ఎకరానికి రూ.1000 చొప్పున రోజుకు నాలుగు డ్రమ్ సీడర్‌లతో 7 నుంచి 8 ఎకరాల్లో వరి విత్తనాలు విత్తుతున్నారు. దీంతో ఆ నలుగురు కలిసి ఒక్కొక్కరు రోజుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు సంపాదిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్‌లలో నాలుగు నెలల వరకు పని ఉంటుందని వారు చెబుతున్నారు.

ఐదేళ్లుగా ఉపాధి పొందుతున్నాం



ఐదేళ్ల క్రితం స్నేహితులతో కలిసి నాలుగు డ్రమ్‌సీడర్‌లు కొనుగోలు చేశాం. మా మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాలు వేశాక, రైతుల ద్వారా పక్క మండలాల్లో కూడా విత్తనాలు వేస్తున్నాం. ఒక ఎకరంలో విత్తనాలు వేస్తే ఎకరానికి రూ.1000 చెల్లిస్తున్నారు. దీంతో గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి పొందుతున్నాం.

– తండు ప్రవీణ్, చీదెళ్ల

8 ఎకరాల్లో విత్తనాలు వేస్తున్నాం



రోజుకు 7 నుంచి 8 ఎకరాల్లో డ్రమ్ సీడర్‌ల ద్వారా వరి విత్తనాలు వేస్తున్నాం. రోజుకు మాకు రూ.1500 నుంచి రూ.2000 వరకు కూలీ గిట్టుబాటు అవుతుంది.

– వేర్పుల వీరబాబు, చీదెళ్ల